# సమష్టి కృషితో ఎన్నికలు విజయవంతం




మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

■ **ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 8 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో జరిగిన శాసనసభ నియోజకవర్గ సాధారణ ఎన్నికలను అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేశారని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శుక్రవారం ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవోలు కదం సురేశ్, కాసపోయిన సురేశ్‌తో కలిసి ఎన్నికల్లో విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసినందుకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన 599 పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు, వివాదాలు లేకుండా, చెక్ పోస్టుల వద్ద, ఆయా నియోజకవర్గాలలో ఎన్నికల కొరకు నియమించబడిన ప్రత్యేక బృందాలు, నామినేషన్లు, ఈవీఎం రాండమైజేషన్ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత భద్రపరిచే వరకు అన్ని దశలలో సమష్టిగా కృషి చేశారని అన్నారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్, పోలీసు శాఖ, సూక్ష్మ పరిశీలకులు, వెబ్ కాస్టింగ్, స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్ , వీడియో పరిశీలన, అకౌంటింగ్ బృందాలతో పాటు కంట్రోల్ రూమ్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా సెల్, ఎన్నికల అధికారులు, సిబ్బంది సంపూర్ణ సహకారం అందించారని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల విజయవంతానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 8: విద్యార్థులు తమ చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గురుకుల డిగ్రీ కళాశాలల అసిస్టెంట్ సెక్రటరీ సోమనాథ్ శర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాలను డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, గురుకులాల సమన్వయాధికారి గంగాధర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెగ్యులర్ అకాడమిక్‌తో పాటుగా ఐఐటీ, సీఏటీ, జీఆర్ఈ లాంటి ప్రత్యేక కోచింగ్ ఇస్తూ గిరిజన విద్య కోసం గురుకులం నిరంతరం కొత్త కార్యాచరణతో ముందుకు సాగుతుందని అన్నారు. అంతేకాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించే డేటా సైన్స్, మొబైల్ అప్లికేషన్ తదితర రంగాల్లో తమ అభిరుచులకు అనుగుణంగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని శ్రమించాలి అన్నారు. గురుకులం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి గిరిజన డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని విద్యార్థుల అధికారుల దృష్టికి తీసుకు రావడంతో ప్రస్తుత ప్రిన్సిపాల్ దివ్యారాణిని విధుల నుంచి తప్పించినట్లు తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇచ్చోడ, స్థానిక పీటీజీ ప్రిన్సిపాల్స్ రాజేంద్రప్రసాద్, సురేశ్ పాల్గొన్నారు.

# 1న ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

హాజీపూర్, డిసెంబర్ 8 : ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించే విధంగా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(టీఎన్జీవోస్) జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు ప్రమాణం చేసిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను విడుదల చేసి పీఆర్సీ ఇచ్చి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షుడు కేజియారాణి, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, బెల్లంపల్లి, చెన్నూర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి

కోటపల్లి, డిసెంబర్ 8 : కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రగిరి సమ్మయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. రాపనపల్లి గ్రామానికి చంద్రగిరి సమ్మయ్య(34) వ్యవసాయ పనుల నిమిత్తం వెలమపల్లి గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సరిత, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 8 : తమ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ దివ్యరాణి తమపై వ్యవహరిస్తున్న ప్రవర్తన తీరు సరిగా లేదని ఆమెను సస్పెండ్ చేయాలని బూరుగూడలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రిన్సిపాల్ మానసికంగా వేధిస్తున్నారని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికి డీడీ రమాదేవి, సంబంధిత అధికారులు అక్కడికి చేరుకొని విద్యార్థులకు సముదాయించిన వినలేదు చివరికి అధికారులు డిగ్రీ కళాశాలల అసిస్టెంట్ సెక్రటరీ తో ఫోన్ లో మాట్లాడి ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పెంపు

కాగజ్‌నగర్, డిసెంబర్ 8 : కాకతీయ విశ్వవిద్యాలయ రెగ్యులర్ డిగ్రీ విద్యార్థుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్‌కు సంబంధించిన పరీక్ష ఫీజు గడువును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 11వ తేదీ వరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారులు పొడిగించినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## నిర్మల్ జిల్లాకు రానున్న ఎన్ఎంసీ బృందం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 8 : నిర్మల్ వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ బృందం జనవరిలో రానుంది. జిల్లా కేంద్రంలో కొత్తగా వైద్య కళాశాల ఏర్పాటైన విషయం విధితమే. వైద్య కళాశాలలో మొదటి సంవత్సరానికి గాను అడ్మిషన్లు పూర్తికాగా ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది సైతం తరగతులు నిర్వహించేందుకు గాను తగిన వసతులు ఉన్నాయా, అసౌకర్యాలున్నాయా అనే అంశాలను పరిశీలించేందుకు ఎన్ఎంసీ బృందం జిల్లాకు రానుంది. వైద్య కళాశాలతో పాటు దవాఖానలో రోగుల సేవలు, వసతులను పరిశీలించనుంది. అన్ని వసతులు ఉన్నట్లయితే రెండో సంవత్సరం విద్య కొనసాగించేందుకు గుర్తింపు ఇవ్వనుంది. జిల్లాకు ఎన్ఎంసీ బృందం రానుండడంతో వైద్యాధికారులు తగు సన్నాహాలు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 8 : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం కానున్న నేపథ్యంలో రీజినల్ మేనేజర్ సోలోమాన్ ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆధార్ చూపించి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణః చేయవచ్చని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయలు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్ 8 : కాగజ్‌నగర్ నుంచి డబ్బా వెళ్లే ప్రధాన రహదారిపై కడంబా సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈస్గాం ఎస్ఐ రామన్ కుమార్ వివరాల ప్రకారం... బెజ్జూరులో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న తుకారాం, మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న విజయ్ బైక్‌పై కాగజ్‌నగర్ వైపు వస్తుండగా కడంబా సమీపంలో ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తున్న చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన రమేశ్ మద్యం మత్తులో ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తుకారాం, విజయ్‌కు తీవ్రంగా, రమేశ్ స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 8 : ఈ నెల 30వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి రమేశ్ అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా కోర్టు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేల అధికారులు చర్యలు తీసుకోవాలని, దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులు, భూతగాదాలు, రోడ్డు ప్రమాదపు కేసులలో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి రాజీపడేలా అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ యువరాజ్, ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకట రమణ, న్యాయవాదులు, వివిధ మండలాల సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో రాయితో దాడి : వ్యక్తి మృతి

బెజ్జూర్, డిసెంబర్ 8 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరె వసంత్ మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన ఆదె పురుషోత్తం(46)తో గొడవ పడి రాయితో కొట్టగా మృతి చెందినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. గురువారం సాయంత్రం టాకిరె వసంత్ మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన ఆదె పురుషోత్తంను దూషిస్తూ కొట్టడానికి పోయాడు. పురుషోత్తం వసంత్‌ను అడ్డుకున్నాడు. కానీ వసంత్ చేతిలో రాయి తీసుకొని పురుషోత్తం తలపై బలంగా కొట్టడంతో గాయమై కింద పడ్డాడు. ఇంటి ముందే మళ్లీ కింద పడిపోయాడు. భార్య శంకర్‌బాయి గమనించి కిందపడిన భర్త తలపై గాయం చూసి మంచంపై పడుకోబెట్టినది. ఏమైందో తెలుసుకునే సరికి తన భర్తకు టాకిరె వసంత్‌కు గొడవ జరిగినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు పురుషోత్తంకు ఎలాంటి చికిత్స చేయించలేదు. తెల్లవారు శుక్రవారం ఉదయం 6 గంటలకు పురుషోత్తం నిద్ర లేపగా లేవలేదు. దీంతో ఇరుగు పొరుగు వారు వచ్చి పురుషోత్తం మరణించినట్లు తెలిపారు. పురుషోత్తం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314356-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677